సాక్షి అనకాపల్లి

బుధవారం । 26 । మార్చి । 2025



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.2 నుంచి 39.0 డిగ్రీలు. కనిష్ట ఉష్ణోగ్రతలు 24.5 నుంచి 25.8 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	బుధ	గురు
అనకాపల్లి	6.13	4.41
నర్సీపట్నం	6.16	4.38

న్యూస్‌రీల్

గవర్నర్‌కు సాదర వీడ్కోలు



విశాఖ విమానాశ్రయం లోపలకు వెళ్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు

గోపాలపట్నం: రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఇక్కడి నుంచి ఇండిగో విమానంలో విజయవాడ బయలుదేరారు. అధికారులు వారికి సాదరంగా వీడ్కోలు పలికారు.

పోలీసులకు ఉగాది పురస్కారాలు



ఏఎస్‌ఐ శ్రీనివాసరావు



రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మన్మథరావు

అనకాపల్లి: ఉగాది పండగను పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖలో ప్రతిభావంతులైన సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించిందని ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 మందికి ఉత్తమ సేవా పతకం, సేవా పతకాలు ప్రకటించినట్లు ఆయన చెప్పారు. అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ బి.శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పతకం లభించిందని చెప్పారు. సేవా పతకాలు పొందిన వారిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.మన్మథరావు, ఏఆర్ ఎస్‌ఐ కె.భోజరాజు, అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ కె.జె.ఐ.జి.ప్రదీప్‌కుమార్, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.సత్యనారాయణ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వై.ఆనందరావు, ఏఆర్ కానిస్టేబుల్ ఇ.తవిటి నాయుడు, కానిస్టేబుల్ ఆర్.రమణ ఉన్నట్లు తెలిపారు.

రైతు సంఘాలకు ప్రభుత్వ సబ్సిడీ

అనకాపల్లి: గ్రామాల్లో రైతులు సంఘంగా ఏర్పడి ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పొందాలని పశువైద్యశాఖ ఏడీ బి.సౌజన్య అన్నారు. స్థానిక గాంధీనగరం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో 750మంది రైతులు ఒక సంఘంగా ఏర్పడి ఒక్కొక్క రైతు రూ.500 నగదు సంఘంలో నిల్వ ఉంచుకుని, గడ్డి కోసే యంత్రాలను కొనుగోలు చేసుకోవాలని, వారికి ప్రభుత్వం నుంచి సబ్సిడీ వస్తుందన్నారు. జిల్లాలో మొదటిసారిగా కశింకోట మండలం నుంచి ప్రారంభించామన్నారు. సంఘం సభ్యులు రూ.15 లక్షల నిల్వ ఉంచితే ప్రభుత్వం నుంచి అదనంగా మరో రూ.15 లక్షలు వస్తుందని, మొత్తం రూ.30 లక్షల నిధులతో రైతులకు కావలసిన యంత్రాలను కొనుగోలు చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట పశు వైద్యులు అనిల్, రామారావు, శ్యామల, సంఘం మిత్ర అధ్యక్షురాలు ఎస్.చిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోదాం పదే యాతర
నూకాలమ్మ జాతర



ఎన్టీఆర్ స్టేడియంలో నెలకొల్పే అమ్మవారి ఉత్సవ విగ్రహం



ఊరేగింపునకు ఘటాలతో బయల్దేరిన మహిళలు



నూతనంగా నిర్మిస్తున్న నూకాంబిక ఆలయం

- నెల రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు
- రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 28, 29 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. 28న జాతర, 29న కొత్త అమావాస్య పండగ, 30న ఉగాది వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెల రోజులపాటు జరగనున్న జాతర ఏప్రిల్ 27వ తేదీతో ముగుస్తుంది. అమ్మవారు కొలువై ఉన్న బాలాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేసవి కావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లను సిద్ధం చేశారు. మంచినీటి కూలర్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లను కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో మరింత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఆలయ పరిసరాల్లోనే ఈ పండగ వాతావరణం కనిపించేది. ఈసారి పట్టణం నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో కూడా ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో భారీ వేదిక రూపొందించి భక్తులందరికీ కనిపించేలా అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. ఈ అమ్మవారి విగ్రహానికి రెండు పూటలా ప్రత్యేక పూజలు చేయడానికి కూడా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే స్టేడియం పరిసరాలను పల్లెటూరి వాతావరణం ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నారు. జెయింట్‌వీల్, మూవింగ్ ట్రైన్, రన్నింగ్ షిప్, పిల్లలు ఆడుకొనే వివిధ రకాల వస్తువులు, తినుబండారాల స్టాల్స్ నెలకొల్పనున్నారు. ఆధ్యాత్మికత ప్రతిఫలించేలా సంకీర్తనలు, కోలాటం, జానపద నృత్యాలను నెల రోజులపాటు నిర్వహించనున్నారు. నెల రోజుల జాతర కోసం ఎన్టీఆర్ స్టేడియంలో నెలకొల్పే 12 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం గవరపాలెం పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

భక్తులకు మూలవిరాట్ దర్శనం లేనట్టే..

అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణ పనులు గడిచిన రెండేళ్లుగా నిర్విరామంగా చురుగ్గా సాగుతున్నాయి. మధురైలోఉన్న మీనాక్షి అమ్మవారి గుడి తరహాలో నిర్మాణం చేపడుతున్నారు. సుమారు రూ.10 కోట్ల నిధులతో ఆలయం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. గతంలో ఒకవైపు ప్రధాన గోపురం ఉండేది. ఇప్పుడు మిగిలిన మూడు వైపులా రాజగోపురాలు, అంతరాలయం, అలివేటి మండపం నిర్మిస్తున్నారు. అన్ని హంగులు పూర్తయ్యాక దసరాకు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో గర్భాలయంలో అమ్మవారి మూలవిరాట్ దర్శనం ఈ ఏడాది కూడా లేనట్టయింది. ఈ నేపథ్యంలో భక్తులు బాలాలయంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.

కారాగారం..
జ్ఞాన సాగరం



జ్ఞానసాగర్ గ్రంథాలయం

- ఖైదీల విద్యా వికాసానికి కృషి
- జైలు సంక్షేమ నిధి నుంచి వారి చదువుకు అయ్యే ఖర్చు
- విద్యా కేంద్రంగా విశాఖ కేంద్ర కారాగారం

అరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం శిక్షా కేంద్రంగానే కాకుండా.. విద్యా కేంద్రంగానూ రూపాంతరం చెందుతోంది. నేరాల చీకటిలో మగ్గుతున్న ఖైదీలకు విద్య ద్వారా కొత్త జీవితాన్ని వెలిగించే ప్రయత్నం జరుగుతోంది. కారాగారం నాలుగు గోడల మధ్యనే ప్రాథమిక విద్య నుంచి పోస్ట్-గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే సౌకర్యం ఉండటం విశేషం. 2024-25 విద్యా సంవత్సరంలో 120 మంది ఖైదీలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 90 మంది ప్రాథమిక విద్యను పూర్తి చేస్తుండగా.. 19 మంది పదో తరగతి ఓపెన్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలను రాశారు. అంతేకాకుండా ఆసక్తి ఉన్న ఖైదీలు ఖాళీ సమయాల్లో చదువుకుంటూ డిగ్రీలు పొందుతున్నారు. కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, వివిధ వృత్తుల్లో ఇక్కడ ఖైదీలు శిక్షణ పొందుతున్నారు. గతంలో ఇక్కడ శిక్ష అనుభవించిన ఒక ఖైదీ పీజీ పూర్తి చేసి బంగారు పతకం సాధించడం విశేషం. పని చేస్తూనే చదువుకునే వెసులుబాటు ఉండటంతో, శిక్ష పూర్తయిన అనంతరం విద్యావంతులుగా బయటకు వస్తున్న ఖైదీల సంఖ్య పెరుగుతోంది.

అన్నీ జ్ఞానసాగర్‌లోనే..

జైలు లోపల 'జ్ఞానసాగర్'పేరుతో విద్యాలయం ఉంది. ఇక్కడ గ్రంథాలయం, తరగతి నిర్వహణ, **విద్యా బోధన, పరీక్షల నిర్వహణ తదితర సౌకర్యాలు ఉన్నాయి. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలిద్దరూ ఇక్కడ చదువుకుని పరీక్షలు రాయవచ్చు. చదువు లేని వారికి వయోజన విద్య ద్వారా అక్షరజ్ఞానం కలిగిస్తున్నారు. వారికి ప్రాథ**మిక స్థాయి నుంచి చదవడం, రాయడం నేర్పుతున్నారు.

ఇందుకోసం జైళ్ల శాఖ ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. ఈ ఉపాధ్యాయుడు ఖైదీల విద్యా సంబంధిత విషయాలన్నింటినీ చూసుకుంటారు. ఖైదీలు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి వారికి తరగతులు నిర్వహించడం, బోధించడం, పరీక్షలు నిర్వహించడం వరకు అతనే ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయి.

ఖైదీల్లో మార్పు కోసం..



ఖైదీల్లో పరివర్తనం సాధించడానికి చదువు ఉపయోగపడుతుంది. విచక్షణ కల్పించడానికే ఇక్కడ ఖైదీలను విద్యావంతులను చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రత్యేకంగా నియమించిన ఉపాధ్యాయుడు ద్వారా వారికి బోధన జరుగుతోంది. ఖైదీల చదువుకు అయ్యే ఖర్చు, పరీక్ష ఫీజులను జైలు సంక్షేమ నిధి నుంచే చెల్లిస్తారు. చదువు మధ్యలో నిలిపివేసి జైలుకు వచ్చినవారు.. ఇక్కడ చదువు కొనసాగించుకోవచ్చు.

– ఎన్.సాయిప్రవీణ్, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్

ఐదేళ్లలో చదివిన ఖైదీలను పరిశీలిస్తే..



జైలులో ఇటీవల ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఖైదీలు

ఇక్కడ ప్రతి సంవత్సరం చదువుకున్న ఖైదీల సంఖ్య మారుతూ ఉంటుంది. కొత్త వారు రావడం, శిక్ష పూర్తయిన వారు వెళ్లిపోవడం వల్ల ఈ సంఖ్యలో మార్పు ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో మొత్తం 55 మంది ఖైదీలు ఓపెన్ పదో తరగతిలో చేరారు. 20 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. డిగ్రీ స్థాయిలో బీఏ కోర్సును 29 మంది పూర్తి చేయగా, ఒకరు పీజీలో ఎంఏ పరీక్షలు రాశారు.

- 2020-21లో 80 మంది ప్రాథమిక విద్య, 26 మంది ఓపెన్ టెన్త్, 14 బీఏ చదువుకున్నారు.
- 2021-22లో 90 మంది ప్రాథమిక విద్య, 10 మంది ఓపెన్ టెన్త్, 9 మంది బీఏ విద్యనభ్యసించారు.
- 2022-23లో 82 మంది ప్రాథమిక విద్య, ఆరుగురు బీఏ, ఒకరు ఎంఏ చదివారు.
- 2023-24లో 80 మంది ప్రాథమిక విద్య, 9 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ చదివారు.
- 2024-25 (ప్రస్తుతం)లో 90 మంది ప్రాథమిక విద్య కొనసాగిస్తుండగా, 19 మంది ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు.

కొత్త కోర్సులతో మరిన్ని విజయాలు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా ఉద్యోగ విజయోత్సవం



విద్యార్థినికి ఉద్యోగ పత్రం అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: పాలిటెక్నిక్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, కళాశాలలో విద్యను అభ్యసిస్తూ పలు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన వారికి ఉద్యోగ పత్రాలను అందజేశారు. కొత్త కోర్సులు వస్తే విద్యార్థులకు మరిన్ని విజయాలు సిద్ధిస్తాయన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1985లో పాలిటెక్నిక్ కళాశాలను స్థాపించామని, అప్పట్లో ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు మాత్రమే ఉండేవన్నారు. 1986లో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును ప్రారంభించారని, ఉత్తీర్ణత శాతం 96 వరకు ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. ఈ ఏడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో ఈసీఈ బ్రాంచ్‌లో 50 మంది, మెకానికల్ బ్రాంచ్‌లో 39మంది, మైనింగ్ బ్రాంచ్‌లో ఆరుగురికి ఉద్యోగావకాశాలు వచ్చాయన్నారు. 42 మంది విద్యార్థులు అమెజాన్, ఇన్ఫోసిస్, ఒరాకిల్, టెక్ మహీంద్ర వంటి ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యలమంచిలి పట్టణ బడ్జెట్ రూ.11.94 కోట్లు IIలో

సుప్రీం తీర్పునకు టీడీపీ సర్కారు తూట్లు



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన నిర్వాసితులు

- డీఫారం భూములకు నష్ట పరిహారం చెల్లించాలి
- తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితుల ధర్నా

నక్కపల్లి: సుప్రీంకోర్టు తీర్పుననుసరించి డీఫారం రైతులకు నష్ట పరిహారం, ప్యాకేజీ చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు ప్రారంభించాలంటూ డీఎల్‌పురం గ్రామానికి చెందిన నిర్వాసితులు మంగళవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. సర్వే నంబరు 193 నుంచి 199 వరకు ఉన్న 64 ఎకరాల ప్రభుత్వ భూములను 1967లో పేదలకు డీఫారం పట్టాలు పంపిణీ చేశారని, తాజాగా ప్రభుత్వం విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయబోతున్న బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు కోసం భూములు సేకరించి వాటిలో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టారన్నారు. డీఎల్‌పురంలో పేదలకు చెందిన 64 ఎకరాలకు నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు పనులు చేపడుతున్నారని బాధిత రైతులు ఆరోపించారు. నష్టపరిహారం చెల్లించాలంటూ రైతులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు వ్యవహారం తేలకముందే ఏపీఐఐసీ అధికారులు పోలీసు యంత్రాంగాన్ని అడ్డు పెట్టుకుని దౌర్జన్యంగా పేదలకు చెందిన భూముల్లో రోడ్డు పనులు ప్రారంభించారని అన్నారు. దీనిపై బాధిత రైతులంతా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. వీరికి సీపీఎం జిల్లాకార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సర్పంచ్ కిల్లాడ కృష్ణ, మాజీ ఎంపీటీసీ గింజాల వెంకటరమణ సంఘీభావం ప్రకటించారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేష్, రైతు నాయకులు పాల్గొన్నారు.

జీడి రైతుకు మద్దతేదీ?



దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

- గిట్టుబాటు కల్పించి, ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయాలి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల నిరసన

దేవరాపల్లి : జీడి పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించడంతో పాటు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని గిరిజనులు, రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తామరబ్బ, చింతలపూడి, వాలాబు, గరిశింగి, చినగంగవరం తదితర గ్రామాల నుంచి గిరిజన రైతులు కదం తొక్కారు. పేదలు సాగులో ఉన్న పోడు, ఫారెస్టు భూములకు పట్టాలు ఇవ్వాలని, గతంలో పట్టాలు ఇచ్చిన వారందరికీ ఆన్‌లైన్ చేయాలని, జీడి పిక్కలకు కిలోకు రూ. 200 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర మాట్లాడుతూ జీడి పంటను ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వరి, చెరకు తదితర పంటల మాదిరిగా మద్దతు ధర ప్రకటించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట దిగుబడి సమయంలో వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారులు చేతిలోకి వెళ్లగానే ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జీడి పంట విస్తరణకు గతంలో ఇచ్చిన రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిహెచ్.చినదేముడు, టి.శంకర్, ఎం.ఎర్రునాయుడు, జె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు వద్దంటే వద్దు



మునగపాక రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ

- పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల అకౌంట్‌లో నగదు జమ చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాలని కోరుతూ మునగపాక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. విస్తరణ బాధితులతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణ ఎంతో అవసరమన్నారు. అయితే భూములు, గృహాలు కోల్పోతున్న బాధితులకు మెరుగైన పరిహారం ఇస్తామని పాలకులు, అధికారులు చెప్పిన విషయాన్ని విస్మరించరాదన్నారు. గ్రామసభలు నిర్వహించిన అధికారులు ప్రతి బాధితుని బ్యాంక్ అకౌంట్‌లో పరిహారం వేస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు టీడీఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. బాండ్లను మార్చుకోవడం బాధితులకు తెలియదన్నారు. రహదారి విస్తరణను వైఎస్సార్‌సీపీ స్వాగతిస్తుందని అయితే పరిహారం అందించే విషయంలో టీడీఆర్ బాండ్లు కాకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమ జరిగేలా చూడాల్సి ఉందన్నారు. శంకుస్థాపనకు ముందుగానే ప్రభుత్వం పరిహారం ఎలా ఇస్తుందో తెలియజేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాక అఖిలపక్ష సమావేశం నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా పార్టీలకు అతీతంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం డీటీ శేషుబాబుకు వినతి పత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, సుందరపు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సదరన్ రీజియన్ నిర్వహించిన 4వ ఎడిషన్ ఆంధ్రప్రదేశ్ సేఫ్టీ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2024లో అదానీ గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ మాదిరెడ్డి ప్రతాప్ చేతుల మీదుగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు అవార్డును అందుకున్నారు.

మరణించి మరొకరికి వెలుగునిచ్చి..



శ్రీరాములు నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి: మరణించిన తరువాత కూడా ఒకరికి కంటి చూపునందించాడు ఓ పెద్దాయన. పెందుర్తి జేఎన్ఎన్ఎస్‌యూఆర్ఎం కాలనీలో ఉంటున్న గోదావరి శ్రీరాములు అనే వ్యక్తి మంగళవారం మృతి చెందగా.. అతని నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చొరవతో ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం మోసన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు కార్నియా సేకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను, సభ్యుడు శీరపు మహేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలి పట్టణ బడ్జెట్ రూ.11.94 కోట్లు

- నిధులు వృథా అవుతున్నా పట్టదా?
- 10వ వార్డులో అనధికార నిర్మాణాలపై చర్యలేవీ...
- కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



సమస్యలపై మాట్లాడుతున్న వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా

యలమంచిలి రూరల్ : పురపాలక సంఘం 2025–26 సంవత్సరం బడ్జెట్‌ను రూ.11.94 కోట్ల అంచనాలతో కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మంగళవారం చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన 50వ పాలకవర్గ సమావేశంలో కమిషనర్ బి.జె.ఎస్ ప్రసాదరాజు, వివిధ విభాగాల అధికారులు, ఇంజినీర్లు హాజరయ్యారు. 2024–25 బడ్జెట్ అంచనాలు, సవరణలు,2025–26 ఏడాది అంచనాలను సభ ముందుంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగులు నిధులు రూ.41.88 లక్షలు చూపించగా, వచ్చే సంవత్సరానికి రూ.47.06 లక్షలు మిగులు అంచనాగా చూపించారు. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.11,94,69,321, జమలు రూ.9,41,38,500, ఖర్చులు రూ.8,07,02,000గా చూపించారు. వార్షిక బడ్జెట్‌లోని అంకెలు, వివరాలు అర్థం కాక సభ్యులు తీవ్ర అసహనానికి గురయ్యారు. అంతకు ముందు 19 అంశాలతో కూడిన సాధారణ అజెండాతో పాటు 6 అంశాలతో ఉన్న అత్యవసర సమావేశపు అజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 6వ అంశంలో పేర్కొన్న విధంగా మాజీ సైనికోద్యోగుల ఇళ్లకు ఆస్తి పన్ను రాయితీపై వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు మాజీ సైనికోద్యోగులు ఆస్తి పన్ను రాయితీ పొంది భవనాలను అద్దెకు ఇచ్చుకుంటూ ఆదాయం పొందుతున్నారన్నారు. దీనిపై వాస్తవాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్రస్తావించిన అంశాలు

- గతంలో పురపాలక సంఘ కార్యాలయానికి సౌర విద్యుత్ అందించడానికి లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన సోలార్ ప్యానెళ్లు కార్యాలయం పైన నిరుపయోగంగా ఉన్నాయని, ఈ విషయంపై ఇప్పటికి పలుసార్లు పాలకవర్గ సమావేశాల్లో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోలేదని వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- దిమిలి రోడ్డు కూడలి వద్ద కూరగాయల మార్కెట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు వేసుకుని వ్యాపారం చేసుకుంటూ మున్సిపాలిటీకి పన్ను కట్టడం లేదని మరో వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల వసూళ్లపై ప్రస్తావించారు. 66 అసెస్మెంట్లకు సుమారు రూ.కోటి వరకు బకాయి ఉందని రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు.
- ఐదేళ్ల క్రితం మున్సిపల్ కౌన్సిల్ హాలు నిర్మాణానికి రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినా ఇప్పటివరకు ఆ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని, గతంలో 8 సార్లు ఈ విషయంపై సమావేశాల్లో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోలేదని, ప్రతిసారీ సమావేశం నిర్వహించడానికి నెలకు రూ.6 వేలు చొప్పున ఏడాదికి రూ.72 వేలు వృథా చేస్తున్నారని వైస్ చైర్మన్ గుప్తా మండిపడ్డారు.
- మర్రిబంద జగనన్న కాలనీలో ఇళ్లన్నీ పట్టణానికి చెందిన వారికే ఇచ్చామని అక్కడ నీటి సరఫరా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ సభ్యులు లేవనెత్తారు.

–రోజువారీ, వారపు సంత, పశువుల మార్కెట్, మేకల కమేళాలకు సంబంధించి ఆశీలు వసూళ్లకు వేలం పాట నిర్వహణకు సంబంధించి సరైన ప్రచారం చేయకుండా పాటదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రామారాయుడుపాలెం వార్డు కౌన్సిలర్ సుంకర మరిణేశ్వరరావు ఆరోపించారు. అశీలు వసూళ్లకు సంబంధించిన వేలంపాట సమాచారం ఏఏ పత్రికల్లో ప్రకటన ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

- ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్మించిన కొన్ని దుకాణాలకు ఆస్తి పన్ను విధించలేదని, ఆదాయం కోల్పోతున్నా పట్టదా..అని వైస్ చైర్మన్ బెజవాడ నిలదీశారు.
- 10 వార్డులో అనధికార కట్టడాలు, అంతస్తుల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆ వార్డు సభ్యురాలు మంజేటి సరోజిని అధికారులను నిలదీశారు. దీనిపై రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

ఘనంగా వీరాంజనేయస్వామి తీర్థం



ఎం.కోటపాడులో స్వామి వారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, తదితరులు



ఎడ్ల పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని పరువాడ నాయుడుకు బహుమతి అందజేస్తున్న శానాపతి కొండలరావు తదితరులు

- ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్ : ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామ ఆరాధ్య దైవం వీరాంజనేయస్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలునాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనను మాడుగుల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎం.కె.వల్లాపురం ఉప సర్పంచ్ కరణం రాము, వల్లాపురం మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామ్మూర్తి, వాసవీక్లబ్ సభ్యుడు శ్రీనాదు రాజారావు శాలువ కప్పి సత్కరించారు. మధ్యాహ్నం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద అన్నసమారాధన జరిపారు. సాయంత్రం మహిళల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎడ్ల బళ్ల పోటీల విజేతలు

ఎం.కోటపాడులో వీరాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు జరిగాయి. పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొనగా అర్జునగిరికి చెందిన పరువాడ నాయుడు ఎడ్లకు ప్రథమ బహుమతి (రూ.15వేలు) దక్కింది. అలాగే ద్వితీయ బహుమతి పైడితల్లమ్మ (లెక్కవానిపాలెం) రూ.12వేలు, తృతీయ బహుమతి కోలిపర్తి రామునాయుడు(కలగాడ) రూ.10వేలు, నాలుగో బహుమతి మరిడిమాంబ(వాయిల్పాడు) రూ.8వేలు, ఐదో స్థానంలో నిలిచిన బండారు చరణ్ హర్ష ఎడ్లు (కె.యల్.బి.పట్నం) రూ.6వేలు చొప్పున నగదు బహుమతులు పొందారు. అలాగే మొత్తంగా 11 స్థానాల్లో నిలిచిన వారికి వివిధ నగదు బహుమతులు అందించారు.

జిల్లా తనిఖీ బృందం పరిశీలన



కస్తూర్బా పాఠశాలలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా తనిఖీ బృందం సభ్యుడు ఎంఈవో వరహాలబాబు

నాతవరం : ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సామగ్రి సక్రమంగా సకాలంలోఅందేలా పర్యవేక్షించడమే మా బాధ్యత అని విద్యాశాఖ తనిఖీ బృందం సభ్యుడు జిల్లా కోఆర్డినేటరు సిహెచ్.దేవరాయులు అన్నారు. మండలంలో మంగళవారం కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వంటకాలను స్వయంగా పరిశీలించి నాణ్యతను రుచి చూశారు. తర్వాత విద్యార్థినులకు అందించే శానిటరీ నాప్‌కిన్స్ ఏవిధంగా అందిస్తున్నారు.. అడిగి తెలుసుకున్నారు. నాతవరం హైస్కూల్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అక్కడ పరిస్థితులపై విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ విషయంలో నిర్లక్ష్యం చేయరాదని హెచ్ఎం రవిశంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీసీడీవో పద్మ, జిల్లా తనిఖీ బృందం సభ్యులు అచ్యుతరావు, బి.ప్రసాద్, ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు కస్తూర్బా ప్రత్యేకాధికారి భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్‌తో విద్యార్థులను ఢీకొన్న మైనర్ బాలుడు అరెస్టు

- బాలుడికి బైక్ ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు

చోడవరం : మోటారుసైకిల్‌తో హల్‌చల్ చేసి నలుగురు విద్యార్థులను, ఒక టీచర్‌ను గాయాల పాల్జేసిన మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసినట్టు చోడవరం సీఐ అప్పలరాజు మంగళవారం చెప్పారు. మైనర్ బాలుడికి మోటారు సైకిల్ ఇచ్చిన బైక్ యజమానిపై కూడా కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు. ఈనెల 24వ తేదీన గోవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద పదో తరగతి గణితం పరీక్ష రాసేందుకు నర్సాపురం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తీసుకొని టీచర్ నిలబడి ఉండగా, ఇదే కేంద్రంలో దూరవిద్య ద్వారా పదో తరగతి పరీక్ష రాసేందుకు వచ్చిన చోడవరానికి చెందిన ఒక విద్యార్థి మోటారు సైకిల్‌పై వేగంగా అటూ ఇటూ తిరుగుతూ బైకు అదుపు తప్పి పక్కనే ఉన్న నలుగురు కస్తూర్బా విద్యార్థినులను, వారితో ఉన్న మహిళా టీచర్‌ను ఢీకొట్టగా వారు గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సదరు మైనర్ బాలుడిపైనా, ఆ బాలుడికి మోటారు సైకిల్ ఇచ్చిన బైక్ యజమానిపైనా కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

గురుకులం ప్రవేశ పరీక్ష 13కు వాయిదా

ఆరిలోవ: జీవీఎంసీ పరిధి శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల కోసం జరగాల్సిన పరీక్షల తేదీని మార్పు చేసినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్షను, 13కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాల్సిందిగా కోరారు.

క్షణికావేశంతో వివాహిత ఆత్మహత్య



వెంకటలక్ష్మి (ఫైల్)



ఎం.బి.పట్నంలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ

నాతవరం : భర్త మందలించాడన్న కారణంతో భార్య కిరోసిన్ పెట్రోల్ కలిపి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో నెలకొంది. నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అందించిన వివరాల మేరకు మండలంలో ఎం.బి.పట్నం గ్రామానికి చెందిన పల్లి వెంకటలక్ష్మి (30) మంగళవారం ఉదయం తన కుమార్తె అల్లరి చేయడంతో కొట్టింది, అప్పటికే జ్వరంతో ఉన్న కుమార్తెను ఎందుకు కొట్టావంటూ భర్త పల్లి గోవింద్ భార్య వెంకటలక్ష్మి తీవ్రంగా మందలించడమే కాకుండా చెయ్యి చేసుకున్నాడు. దీంతో ఇరువురూ ఇంటి వద్ద ఘర్షణ పడ్డారు. కొంత సేపటి తర్వాత గోవింద్ తన జీడిమామిడి తోటలో పిక్కలు సేకరించడం కోసం వెళ్లిపోయాడు. జ్వరంతో ఉన్న పాపకు మధ్యాహ్నం వెంకటలక్ష్మి భోజనం పెట్టి ఇంటి వద్దే ఉంది. భర్త మందలించాడన్న కోపంతో వెంకటలక్ష్మి వ్యవసాయ ఇంజిన్ మోటారులో వేసేందుకు తీసుకువచ్చి ఇంట్లో ఉంచిన కిరోసిన్, పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్మ చేసుకుంది. కుమార్తె ఇంట్లో జ్వరంతో పడుకొని ఉండడంతో ఇంటి వెనుకకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంది, మృతురాలికి బాబు, పాప ఉన్నారు. వెంకటలక్ష్మి, గోవింద్‌కు 15ఏళ్ల క్రితం వివాహం జరిగింది. క్షణికావేశంతో వెంకటలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబీకులు భోరున విలపించారు. సంఘటన స్థలానికి నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



హామీలు నెరవేర్చే వరకూ పోరాడుతాం..

- ఉద్యోగాలు, భృతి బూటకంగా మారాయి
- ఉన్న పరిశ్రమలే వెనక్కి పోతున్నాయి
- త్వరలో మండల, గ్రామ స్థాయిలో యువజన విభాగం కమిటీల ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చిత్రంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొండా రాజీవ్, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, ఉత్తరాంధ్ర జోనల్ విభాగం అధ్యక్షుడు స్వరూప్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసే వరకూ వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటుచేశామని, త్వరలో మండల, గ్రామ స్థాయి యువజన విభాగం కమిటీలను కూడా ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. మంగళవారం మద్దిలపాలెంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర యువజన విభాగం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. త్వరలో నియోజకవర్గ, మండల, గ్రామ యువజన విభాగం ఇన్‌చార్జిలను నియమించాలని దిశా నిర్దేశం చేశారు. అధికారం చేపట్టిన 10 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, ప్రజలంతా ఎదురు తిరిగే రోజు అతి త్వరలో వస్తుందని జోస్యం చెప్పారు. ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇవ్వడం.. గెలిచిన తరువాత పంగనామాలు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన చంద్రబాబు అండ్ కో.. అధికారం చేపట్టిన తరువాత ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా.? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమలే వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితులను చూస్తున్నామని మండిపడ్డారు. నిరుద్యోగులకు ప్రతీ నెలా రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేవరకూ మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం పోరాడుతూనే ఉంటుందని హామీ ఇచ్చారు.

రాజాకు సత్కారం

ఉత్తరాంధ్ర సమావేశానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను విశాఖ యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొండారాజీవ్ గాంధీ, ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షుడు మెంట స్వరూప్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు మారపు పృథ్వీరాజ్, సూరిబాబు, వెంకటేష్, గవాడ శేఖర్, 66వ వార్డ్ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

నీటి బిల్లు.. కళ్లు భైర్లు!

- మూడు రోజుల్లో రూ.96,915 కట్టాలని జీవీఎంసీ హుకుం
- ఒక్క పైసా కూడా బాకీ లేనంటున్న వినియోగదారుడు

తగరపువలస: తగరపువలసకు వి.వెంకటేశ్వరరావుకు జీవీఎంసీ భీమిలి జోనల్ అధికారులు మంగళవారం జారీ చేసిన నోటీసు చూస్తే ఎవరికైనా కళ్లు భైర్లు కమ్మాల్సిందే! మూడు రోజుల్లో రూ.96,915 కట్టండి. లేకపోతే మీ తాగునీటి కుళాయి పీకేస్తాం.. ఇదీ ఆ నోటీస్ సారాంశం. ఆయనకు 1089002501 నంబర్‌తో తాగునీటి కుళాయి కనెక్షన్ ఉంది. అందుకు ఏడాదికి రూ.900 నీటి పన్ను చెల్లించాలి. కానీ జీవీఎంసీ అధికారులు దాదాపు ఒక శతాబ్దానికి పైగా నీటి బిల్లు బకాయి ఉన్నట్లు నోటీసులు జారీ చేయడం గమనార్హం. వాస్తవానికి 2024–2025 ఆర్థిక సంవత్సరం చివరి వరకు ఆయన నీటి పన్నులు చెల్లించేశారు. గతేడాది ఏప్రిల్ 26న రెండేళ్లకు గానూ రూ.1800 చెల్లించారు. అంతకు ముందు 2022–2023 ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి 15 ఏళ్లకు చెందిన రూ.13,500 బకాయిలు చెల్లించారు. ఈ నెల 31 వరకు జీవీఎంసీకి తాగునీటికి సంబంధించి ఒక్క పైసా కూడా బాకీ లేరు. వాస్తవానికి నీటి పన్నులకు సంబంధించి జీవీఎంసీ ఫైన్ విధించదు. ఎలాంటి బకాయిలు లేకుండా పన్నులు చెల్లిస్తే.. భయభ్రాంతులకు గురి చేసేలా నోటీసులు పంపించి తనని ఆందోళనకు గురి చేస్తున్నారని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

28 నుంచి అనకాపల్లిలో నాటకోత్సవాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళా పరిషత్, డైమండ్ హిట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీలలో నాటకోత్సవాలను నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ రచించిన ఆరు నాటికలు ప్రదర్శిస్తారు. 30వ తేదీ ఉగాదినాడు నంది అవార్డు గ్రహీత ఆకెళ్లను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సత్కరిస్తారు. ఆకెళ్ల నాటక సంబరాల వాల్‌పోస్టర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మంగళవారం ఆవిష్కరించారు.

తీరంలో గుండె'కోత'కు అడ్డుకట్ట



ఏయూక్యాంపస్: విశాఖ సాగరతీరం ఏటా కోతకు గురవుతోంది. దీని కారణంగా తీరం క్రమంగా తగ్గిపోవడం, తీర ప్రాంతంలోని కట్టడాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి, విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సముద్ర గర్భం నుంచి ఇసుకను వెలికి తీసి, పైపుల ద్వారా తీరానికి తరలిస్తోంది. కోతకు గురైన ప్రాంతాల్లో పోస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన డ్రెజ్జర్‌ను డీసీఐ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం సమీపంలో ఈ ప్రక్రియ జరుగుతోంది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పాట కలిపింది.. పాదం కదిలింది



ఏయూక్యాంపస్: చల్లని సాయంత్రం వేళ.. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి సందడి చేశారు. పాపులర్ పాటలకు స్టెప్పులు వేస్తూ యువత కేరింతలు కొట్టారు. వారి నృత్య ప్రదర్శనకు ఆకర్షితులైన పుణేకు చెందిన ఒక వైద్యురాలు కూడా యువతతో కలిసి డ్యాన్స్‌లు వేశారు. దీంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ


విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్

అనకాపల్లి టౌన్: మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద సర్పంచ్ పోడి పరదేశి నాయుడు విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హెచ్‌బీ శ్రీధర్, ఉపాధ్యాయుడు బాబు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబాయ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ జాతర


పరదేశమ్మను దర్శించుకున్న భరత్‌కుమార్ దంపతులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. మండలంలో శంకరం గ్రామంలో పరదేశమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భరత్‌కుమార్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ దేవత ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ, పార్టీ నాయకుడు మలసాల కుమార్ రాజా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ అధికారులపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్: తప్పుడు కేసులు రాసిన తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, 1–2019 సర్క్యులర్ అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైస్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఆవరణలో 'చలో అనకాపల్లి' కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న కండక్టర్, డ్రైవర్లను అకారణంగా చేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, 25 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ స్పందించని డిపో మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్, కార్యదర్శులు నరసింగరావు, సురేష్ నాయుడు, కోశాధికారి మోహన్, జోనల్ కార్యదర్శి బి.ఎస్. రాములు, రీజనల్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,381 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,750	4,220
మొదటి రకం	3,640	4,210
రెండో రకం	3,150	3,760
మూడోరకం	2,900	3,140

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-05 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఉపాధి కష్టాలు

అనలే
వేసవి.. **అపై మండుటెం**దలు.. చెమటోడ్చి **పని చేస్తున్న వేత**నదారుకు గొం**తెండితే గుక్కెడు నీరు** ఇవ్వడం లేదు. **ఎండకు తాళలేక కాసేపు** నీడలో సేద తీరు**దామంటే షామియానాలు** ఏర్పాటు చేయ**లేదు. పని సమయంలో** గాయాలైతే ప్రథ**మ చికిత్స కిట్లు కానరా**వడం లేదు. **ఇలా పలు అసౌకర్యా**లతో పని చేయాల్సిన దుస్థితి నెలకొంది.

- మండుటెండల్లో వేతనదారుల పనులు
- గొంతెండితే గుక్కెడు నీరుండదు
- సేద తీరడానికి నీడ లేదు
- ఫస్ట్ ఎయిడ్ కిట్ల ఊసేలేదు...


రేబాక చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

తుమ్మపాల: ఉపాధి కూలీలకు కేంద్రం నిధులిస్తున్నా అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంతో కూలీలు పని ప్రదేశాల్లో ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. గుక్కెడు మంచినీళ్లు కూడా అందించకుండా వేతనదారులే తెచ్చుకుంటే బిల్లులు చెల్లిస్తామంటూ మభ్య పెడుతున్నారు. గ్రామాల్లో రెండు కిలోమీటర్ల దూరంలో కొండలు, గుట్టలు, చెరువుల్లో పనులు కల్పించడంతో ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. పని ప్రదేశం వద్ద విశ్రాంతి సమయంలో సేద తీరేందుకు నీడ కూడా సమకూర్చలేని విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. నీడ కోసం అందించాల్సిన టెంట్లు ఇవ్వకుండా వేతనదారులే కమ్మల పందిర్లు వేసుకోవాలంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనదారులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించే చర్యలు లేకుండా కూటమి ప్రభుత్వం అవి ఇస్తున్నాం, ఇవి ఇస్తున్నామంటూ ప్రచారం మాత్రం ఊదరగొడుతోంది.

- అనకాపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో దాదాపు 14 వేల వరకు జాబ్‌కార్డుదారులు ఉన్నారు. వారిలో 10 వేల మంది వరకు పనులు చేస్తున్నారు. వేసవి తాపం మొదలు కావడంతో పనులు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేక ఫీల్డు అసిస్టెంట్లు కొన్ని గ్రామాల్లో చెరువులు, కొండలపై పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా పనులకు వెళ్తే ఎండకు వడగాలుల బారిన పడితే తమ పరిస్థితి ఏమిటని బోరుమంటున్నారు. కనీస సౌకర్యాలైన మంచి నీరు, ప్రథమ చికిత్స కిట్లు, విశ్రాంతికి టెంట్లు గత కొన్నేళ్లుగా కల్పించడం లేదని వాపోతున్నారు. అధికారులు మాత్రం పనులను పరిశీలించి లెక్కలతో చేతులు దులుపుకుంటున్నారని, సౌకర్యాల కోసం ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోలేదని వాపోతున్నారు.

కానరాని ఫస్ట్ ఎయిడ్ కిట్లు

ఉపాధి పనులు చేసేటప్పుడు కూలీలు ప్రమాదాల బారిన పడిన, వడదెబ్బలు తగిలిన తక్షణ చికిత్స కోసం పని ప్రదేశంలో ప్రథమ చికిత్స చేయడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అయితే మండలంలో ఉపాధి పనులు జరిగే చోట అవి ఎక్కడా కానరాలేదు. అధికారులు కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీడకు కమ్మల పందిర్లు వేసుకోవాలంట



మండుటెండలో పనులు చేస్తున్నాం. కనీసం చద్దన్నాం తినేందుకు కూడా నీడ లేదు. నీడకు టెంట్లు వేయమంటే తాటి చెట్లు ఎక్కి కమ్మలు కోసుకుని పందిర్లు వేసుకోమంటున్నారు. తాటి చెట్లు ఎక్కేంత సాహసం చేయలేకపోతున్నాం.

– బంటు అప్పారావు, ఉపాధి కూలీ, చింతనిప్పుల అగ్రహారం


ఎండలోనే చద్దన్నం తింటున్న ఉపాధి కూలీలు

మంచినీరు ఇవ్వడం లేదు



పని ప్రదేశంలో దాహం వస్తే మంచినీరు అందించే నాథుడే లేడు. అందుకే పనికి వచ్చేటప్పుడే బాటిల్‌తో మంచినీరు తెచ్చుకుంటున్నాం. పని చేసే చోట చెట్లు ఉంటే అక్కడ సేద తీరడం, లేదంటే ఎండలోనే చద్దన్నం తింటున్నాం. వేసవి వచ్చింది కాబట్టి ఉదయాన్ని 6 గంటలకే పనికి రమ్మంటున్నారు. ఇంటి పని, వ్యవసాయం పని పూర్తి చేసుకునే సరికి సమయం 7 గంటలవుతుంది. ఆలస్యంగా వెళ్తే మస్టర్ లేనట్లే.

– తనకాల మాణిక్యం, ఉపాధి కూలీ, చింతనిప్పుల అగ్రహారం

మెడికల్ కిట్లు రాలేదు

మెడికల్ కిట్లు రావడం లేదు. టెంట్లకు బదులు విశ్రాంతి సమయంలో ఎండ తగలకుండా తాటాకుల పందిర్లు వేసుకోవాలని ఆదేశించాం. వేసవి దృష్ట్యా వేతనదారులు ఎండకు గురవకుండా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేసేలా పనివేళలు మార్పు చేశాం. పని ప్రదేశంలో ఓఆర్ఎస్, మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

– సుప్రియ, ఏపీవో, ఉపాధి హామీ పథకం, అనకాపల్లి మండలం

6న సీతారామస్వామి కల్యాణం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: మెయిన్‌రోడ్డు చేపలబజార్ సీతారామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని వచ్చే నెల 6న నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావునాయుడు తెలిపారు. స్థానిక ఆలయంలో స్వామివారి కల్యాణ పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత అధ్యక్షుడు కె నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, కల్యాణ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిమ్మా పాత్రుని వెంకటేష్, కార్యదర్శి సిరసపల్లి రాజు, కోశాధికారి పాముల ప్రసాద్, ఆలయ కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు(బాబు) పాల్గొన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మండలంలో సీహెచ్ఎన్ అగ్రహారానికి చెందిన నాగరామ అప్పారావు నుంచి పది మద్యం క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వీహెచ్‌పీ సర్వే నిలుపుదల చేయాలని వినతి

అనకాపల్లి: కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన వీహెచ్‌పీ సర్వేను నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ విజయకృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. అసాధారణమైన రీతిలో విశ్వ హిందూ పరిషత్ చాలా గోప్యంగా సర్వే నిర్వహిస్తుందన్నారు. ఈ సర్వే నిర్వహిస్తే ఘర్షణలు జరిగే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇటువంటి సర్వేలను నిషేధించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


ఇ.చౌడువాడలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి

కశింకోట: పరిసరాలను పరిశుభ్రత పాటించాలని ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి కోరారు. మండలంలోని గొబ్బూరు, పరవాడపాలెం, చింతలపాలెం, ఇ. చౌడువాడ గ్రామాల్లో ఆకస్మికంగా మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. చెత్తను తరలించే ప్రాంతాలు, సంపద కేంద్రాలను పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గ్రామాల్లో పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను తెచ్చి రోడ్లపై పోయికుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. సంపద కేంద్రాల్లో చెత్తను నిల్వ ఉంచి ఎరువుల తయారీకి వినియోగించాలన్నారు. మల విసర్జన ఆరు బయట చేయరాదని, ఇంటింటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలన్నారు. ప్లాస్టిక్ మట్టిలో కలవదన్నారు. దీన్ని కాల్చడం వల్ల రసాయనాలు వెలువడి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధించేందుకు గ్రామాల్లో సర్పంచ్‌లు తీర్మానాలు చేసి అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ధర్నా


కశింకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

కశింకోట: స్థానిక భవాని కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కాలనీవాసులు ధర్నా చేశారు. నిత్యం పందులు సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి వల్ల పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని, ప్రాణాంతకమైన మెదడు వాపు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో మురుగు కాలువలను శుభ్రపరచడం లేదని, చెత్త ఎత్తకపోవడం వల్ల పేరుకుపోతుందన్నారు. కాలనీ రోడ్లు ఎత్తు, పల్లాల్లో ఉండటం వల్ల వర్షం నీరు నిల్వ ఉండిపోతుండటంతో ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. బోరింగ్ పంపు దిగువకు ఉండటం వల్ల నీరు పట్టుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సత్వరమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యురాలు డి.డి. వరలక్ష్మి, స్థానికులు భాగ్యలక్ష్మి, ఉమ, మహాలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఆర్ఎల్ఐ విభాగం సమన్వయంతో నిర్వహిస్తున్న కమ్యూనికేషన్ వర్క్‌షాప్‌ను సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఈడీ సమీర్‌శర్మ సూచించారు. హెచ్‌వోపీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ఆయన మాట్లాడారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో ఓరల్, లిఖిత వ్యాపార కమ్యూనికేషన్లపై విశాఖపట్నం ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత వివరించారు. తొలి రోజు సెషన్‌లో ఎలిమెంట్స్ ఆఫ్ వెర్బల్, నాన్ వెర్బల్ కమ్యూనికేషన్, లిఖిత వ్యాపార కరస్పాండెన్స్‌లపై అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, కార్పొరేట్ కమ్యూనికేషన్ బృందం పాల్గొంది. వర్క్‌షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఓ అండ్ ఎం జీఎం పి.కె.జెనా, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, సీ అండ్ ఎం జీఎం వి.టి.కాంబ్లే, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు


ఆక్రమణకు గురైన గెడ్డ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం : ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై కేసులు తప్పవని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎల్. రామారావు స్పష్టం చేశారు. మండలంలోని తామరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 61/3లో ఉన్న ప్రభుత్వ గెడ్డ భూమి ఆక్రమణకు గురైనట్టు మంగళవారం ఆర్ఐ జెట్టి, తామరం వీఆర్వో శాంతకుమారి గుర్తించారన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే రెవెన్యూలోని సర్వే నంబర్ 54 లో కూడా కొందరు గెడ్డ భూమిని ఆక్రమించి గట్లు వేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు

వేరుశనగలో తామర, దీపపు పురుగులు


శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలకు ఎకరాకు 8 కిలోల చొప్పున 20 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా జల్లుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి వరి మాగాణులలో అపరాలు వేసే రైతులు పెసరలో అధిక దిగుబడినిచ్చే ఐపిఎం2-14, డబ్ల్యూజిజి, 42 ఎల్.జిజి.607, ఎల్‌జిజి 600, ఎల్‌జిజి 630, ఎల్‌జీజీ 460 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరాకు 10-12 కిలోలు చొప్పున విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. ఖరీఫ్ పంటగా వేరుశనగ వేసే రైతులకు ఇది అనువైన సమయమని, కదిరి లేపాక్షి, కదిరి 7 బోల్డ్, కదిరి 8 బోల్డ్ వంటి అనువైన రకాలను ఎంపిక చేసుకుని 30''15 సెం.మీ. నిష్పత్తితో విత్తన శుద్ధి చేసి విత్తుకోవచ్చని పేర్కొన్నారు. రబీ వేరుశనగ పంటలో తామర, దీపపు పురుగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. నువ్వులలో ఆకు ముడుత పురుగు నివారణకు క్లోరిపైరిఫోస్ 2.5 మి.లీ., వేపనూనె 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకు మొక్కతోటలలో కలుపు నివారణకు ముచ్చెలు నాటిన 20వ రోజున మెట్రిబుజిన్ 400 గ్రా. +2, 4-డి 800 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారీ చేయాలన్నారు. తుంగ సమస్య ఎక్కువగా ఉన్న చెరకు తోటల్లో ముచ్చెలు/మొక్కలు నాటిన 25, 30 రోజులకు హాలోసల్ఫ్యూరాన్ 36 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారీ చేసుకోవాలన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల చెరకులో ఎర్రనల్లి ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. నివారణకు కరిగే గంధకం లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. టమాటోలో ఆకు ముడత ఆశించే అవకాశం ఉందని, నివారణకు అసిటామిప్రిడ్ 0.2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బెండ తోటల్లో రసం పీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉన్నదని, నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడిలో పిందె రాలటం జరుగుతుందని, నాఫ్తాలిన్ అసిటిక్ ఆసిడ్ 2 మి.లీ ను 10 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, శాస్త్రవేత్తలు బి.భవాని, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపు


అమ్మవారి ఉత్సవ విగ్రహానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే కొణతాల




అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో వివిధ నేల వేషాలు

అనకాపల్లి: కొత్త అమావాస్య జాతర కోసం రూపొందించిన 12 అడుగుల నూకాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం గవరపాలెం పురవీధుల్లో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. జాతర నెల రోజులూ ఈ విగ్రహాన్ని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తుల సందర్శనార్థం ఉంచుతారు. విగ్రహావిష్కరణ సందర్భంగా అమ్మవారి మాలధారణ భక్తులు ఘటాలు, శూలాలతోపాటు అమ్మవారి ప్రభల డ్యాన్స్ ప్రదర్శించారు. పులి వేషాలు, దాండియా, తంబోలా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హారతి ఇచ్చారు. ఈ ఏడాది నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండగగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పండగ ప్రత్యేక అధికారి కె.శోభారాణి, ఈవో వెంపల రాంబాబు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన కార్యక్రమం....
నూకాంబిక మాలధారణల సంఘం వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం కొత్త అమావాస్య జాతర సందర్భంగా ఆలయ ఆవరణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు.

సబ్బవరం వైస్ ఎంపీపీ ఎన్నిక రేపు


మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ స్థానానికి ఈ నెల 27(గురువారం)న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధివిధానాలను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు అనుసరించి స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో చేతులెత్తే పద్ధతిలో వైస్ ఎంపీపీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గత వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఈ ఖాళీ ఏర్పడినట్లు తెలిపారు. 19 మంది మండల ప్రాదేశిక సభ్యులున్నారని, వీరిలో కనీసం 10 మంది(కోరం) సభ్యులు హాజరైతేనే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కోరం లేకపోతే గురువారంనాటి ఎన్నికల ప్రక్రియ వాయిదా వేసి, 28న మరోసారి ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో జరిగే ఈ ఎన్నికలకు ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు కూడా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. సభ్యులంతా హాజరై ఎన్నిక జరిగేలా సహకరించాలని కోరారు.